మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## కేంద్ర గణాంక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సర్వే

**మెదక్ టౌన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గణాంక కార్యాలయం కరీంనగర్ బృందం మెదక్ పట్టణంలో సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సర్వే ముఖ్య ఉద్దేశం వ్యవసాయేతర రంగంలోని చిన్న వ్యాపారాల ఆర్థిక పరిస్థితిని వాటి పనితీరును తెలుసుకోవడం అసంఘటిత సేవా రంగం, అసంఘటిత భవన నిర్మాణాలపై అయ్యే ఖర్చులు, ఆదాయము, వ్యయాలపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ గణాంక శాఖ కార్యాలయం హెడ్ ఆఫ్ ఆఫీస్ కార్యాలయ అధిపతి గోవర్ధన శ్రీనివాసరావు, గుర్రం శ్రీనివాస్‌గౌడ్, ఆరే లక్ష్మీ మ్నారాయణ, మెదక్ మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, టిపివో భూపతి మున్సిపల్ మేనేజర్ భవాని, మున్సిపల్ వార్డు ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**-సిపి డాక్టర్ అనురాధ**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
రాబోవు రెండు, మూడు రోజులు ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సిపి డాక్టర్ అనురాధ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వర్షాల మూలంగా పోలీసు అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు వివరించారు. వర్షాలతో జిల్లాలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే డయల్ 100 లేదా పోలీసు కమిషనరేట్ కంట్రోల్ రూం నంబరు 8712667100 సమాచారం అందిస్తే తక్షణ సహాయక చర్యలు తీసుకుంటామన్నారు. 24 గంటలు పోలీసు అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. చెరువులు,కుంటల నీటి ప్రవాహంపై తగు జాగ్రత్తలు తీసుకొని ప్రత్యేక్షంగా వెళ్లి పరిశీలించాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లల్లో నివాసముంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పోలీసు అధికారులను, సిబ్బందిని సిపి అనురాధ ఆదేశించారు.

## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



విగ్రహావిష్కరణలో మంత్రి దామోదర్ రాజనర్సింహా, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పారితోష్‌పంకజ్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి ఉత్సవం పురస్కరించుకొని, సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఏర్పాటుచేసిన నూతన విగ్రహాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర వైద్య,ఆరోగ్య,కుటుంబసంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖామంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాటాలు,త్యాగాలు వెనకబడినవర్గాల గౌరవాన్ని కాపాడటమే కాకుండా సామాజిక సమానత్వానికి మార్గదర్శకమయ్యాయని అన్నారు. ఆయన జయంతిని రాష్ట్రస్థాయి వేడుకలుగా జరపడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గం శాసనసభ్యులు చింతా ప్రభాకర్, జిల్లాకలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పారితోష్‌పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంఘాల ప్రతినిధులు, వివిధశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీలో కేంద్రప్రభుత్వం విఫలం

**-ఎంపి సురేష్ శెట్కార్**




నిరసన తెలుపుతున్న జహీరాబాద్ ఎంపి సురేష్‌శెట్కార్

**నారాయణఖేడ్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
యూరియా పంపిణీ విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వకుండా నిర్లక్ష్యంచేస్తుందని తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలతోకలసి పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ యూరియా పంపిణీలో కేంద్రప్రభుత్వం తెలంగాణను నిర్లక్ష్యం చేస్తుందని తెలంగాణకు 8.3లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా సరఫరాచేయాల్సి ఉండగా కేవలం 5.3లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా మాత్రమే అందిస్తుందన్నారు. ఈవిషయంలో కేంద్ర వైఖరికి నిరసనగా జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్‌శెట్కార్ సహచర తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలతోకలసి పార్లమెంట్ ఆవరణలో నిరసనచేపట్టారు. అనంతరం మీడియాసమావేశంలో కేంద్రప్రభుత్వం తెలంగాణపట్ల చూపిస్తున్న కక్షపూరిత వైఖరిని ఎండగడతామన్నారు. తెలంగాణకు మరో 3లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా వెంటనే అందించాలన్నారు.

## వర్గల్ మండలంలో పొంగిపొర్లుతున్న చెరువులు

**-క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ హైమావతి**



ఖాన్ చెరువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**వర్గల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
వర్గల్ మండలవ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు ఆదివారం సాయంత్రం నుండి సోమవారం తెల్లవారుఝాము వరకు కురిసిన వర్షాలకు పొంగిపొర్లుతున్నాయి. పలుచెరువులనుండి నీరు రోడ్ల పైకి చేరడంతో వివిధగ్రామాలనుండి రాకపోకలు బంద్ అయ్యాయి. మండలపరిధిలోని అంబర్‌పేట, ఖాన్‌చెరువు, వేలూరు గ్రామంలోని రంగంచెరువు, సామలపల్లిలోని సామలచెరువు వద్ద నీరు పంటపొలాలలోకి చేరి పంటలనష్టం జరిగింది. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ హైమావతి సోమవారంసాయంత్రం సంబంధిత అధికారులతోకలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇదిలా ఉండగా శాఖారం నుండి అంబర్‌పేటకు వెళ్లేదారిలో ఖాన్‌చెరువు రోడ్డుపై ప్రవహిస్తుండ డంతో ప్రమాదకరంగా మారింది. దీంతో గౌరారం పోలీసులు ఆరోడ్డుపై వాహనాలు వెళ్లకుండా ముందస్తుగా బారికేడ్లతో దారిని బంద్‌చేశారు.

## అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దు

**-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



ఉప్పులింగాపూర్ బ్రిడ్జివద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

**వెల్దుర్తి, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో జిల్లాలో వర్షాలు బాగా కురుస్తున్నందున వరదలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని అందుకు ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. సోమవారం మండలకేంద్రమైన వెల్దుర్తిలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. గత రెండురోజులనుండి కురుస్తున్న వర్షానికి మండలంలో చెరువులు కుంటలుతోపాటు హల్దీప్రాజెక్టు డ్యాంలు వరద ఉధృతితో పొంగిపొర్లుతున్నాయి. ఈసందర్భంగా మెదక్ వెల్దుర్తి ప్రధాన రహదారి ఉప్పులింగపూర్ వద్ద గల బ్రిడ్జిపైనుండి వరద ఉధృతి ఉప్పొంగిపోవడంతో రహదారినుండి ప్రయాణికులకు రాకపోకలను రెవెన్యూ, పోలీస్‌సిబ్బంది బారికేడ్లతో బంద్‌చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ లింగాపూర్ వెల్దుర్తి మధ్యలోగల బ్రిడ్జిలు పరిశీలించారు. కుక్కునూరు వద్ద గల బ్రిడ్జిని సైతం పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 48గంటలు భారీవర్షాలుపడే అవకాశం ఉందని అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప బయట ప్రయాణం చేయవద్దని ఆయన అన్నారు. జిల్లాలో 2006 చెరువులు కుంటలు ఉండగా సుమారు 90 వరదతో నిండాయని అన్నారు. కలెక్టర్ కంట్రోల్‌రూమ్, పోలీస్ కంట్రోల్‌రూమ్‌లలో టోల్‌నెంబర్లకు ఫోన్‌చేస్తే అధికారులు వారికికావాల్సిన సహాయాన్ని అందిస్తారు. కదామండలంలోని హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరదనీటితో హల్దీవాగు దిగువభాగం ఉన్న చెక్‌డ్యామ్‌లో నీరుచేరి ఉధృతంగా అలుగులు పారుతున్నాయి. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ బాలలక్ష్మి, ఎస్సై రాజు, ఎంఆర్ఐ నర్సింగ్‌యాదవ్, రెవెన్యూ,పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో ప్రాజెక్టులకు జలకళ

**-నిండుకుండలా మారిన ప్రాజెక్టులు, చెరువులు**

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
ఈసంవత్సరం వర్షాకాలంలో సంగారెడ్డి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనివల్ల జిల్లాలోని అన్ని నీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు పూర్తిస్థాయి నీటిమట్టాలకు చేరుకుని నిండుకుండలా మారాయి. ముఖ్యంగా జిల్లా ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. వర్షాకాలంసీజన్ ప్రారంభం కాగానే రైతులు నార్లువేసి నీటికొరకు ఎదురు చూస్తుండగా వర్షాభావ పరిస్థితులవల్ల బోరుబావులలో నీటిమట్టం తగ్గడంతో ఆందోళన చెందిన రైతులకు ఈవర్షాలు ఊరటనిచ్చాయి. నిరంతరంగా కురుస్తున్నవర్షాలతో జిల్లాలోని ఆయామండలాల్లోని చెరువులు, కుంటలు నీటితోనిండి కళకళలాడుతున్నాయి. జిల్లాలోని ప్రధాన నీటిప్రాజెక్టులైన సింగూరు, మంజీర, నారింజవాగు వంటి నీటి ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. వీటిని ఇటీవలే సంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు సందర్శించారు.

**సింగూరు ప్రాజెక్టు...**
జిల్లాలోని అతి ముఖ్యమైన నీటి వనరు సింగూరు ప్రాజెక్టు. మంజీరానదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టు, భారీవర్షాల కారణంగా పూర్తిగా నిండిపోయింది. జలాశయం నిండుగా ఉండటంతో హైదరాబాద్‌నగరానికి తాగునీటిసరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండాపోయాయి. అలాగే, ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుబాటులోకి వచ్చింది. దీనితో రైతులకు వర్షాకాలం పంటలతోపాటు ఈయాసంగి పంటలకు కూడా సమృద్ధిగా నీరు అందుతుందనే నమ్మకంకలిగింది. సింగూరుప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో అధికారులు అదనంగా 5గేట్లను ఎత్తి దిగువకు నీటినివదులుతున్నారు. దీనితో మంజీరా నది పరీవాహక ప్రాంతాలైన గ్రామాలలో ఇప్పటికే అధికారులు అప్రమత్తం చేశారు. ఆదివారం జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ సింగూరు ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్, ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించారు.

**మంజీరా రిజర్వాయర్...**
సింగూరు ప్రాజెక్టుతోపాటుగా మంజీరా రిజర్వాయర్ కూడా భారీగా నీటితో కళకళలాడుతోంది. ఇక్కడినుంచికూడా హైదరాబాద్‌లోనిచాలాప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుంది. ఈ రిజర్వాయర్ నిండటం వల్ల పర్యాటకులు కూడా ఇక్కడికి వస్తున్నారు.

**చెరువులు, కుంటలు...**
జిల్లాలో ఉన్న చిన్న,పెద్ద చెరువులన్నీ కూడా వర్షాలవల్లనిండిపోయాయి. మిషన్‌కాకతీయద్వారా పునరుద్ధరించిన చెరువులు కూడా పూర్తిస్థాయి నీటి మట్టాలకు చేరుకున్నాయి. దీనివల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. బోరుబావుల్లో నీటిలభ్యత పెరగడం వల్ల వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అనేక కుంటలు, వాగులు కూడా పొంగిపొర్లుతున్నాయి, దీంతో మత్స్యకారులకు మరింత జీవనోపాధి లభిస్తుంది.

**రైతులలో ఆనందం...**
నీటి వనరులు నిండటంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నీటికొరత భయం లేకుండా వ్యవసాయపనులు మొదలుపెట్టారు. ఈసంవత్సరం మంచిదిగుబడివస్తుందని ఆశిస్తున్నారు.అయితే వరదల వల్ల కొన్ని ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లినా, మొత్తం మీద జిల్లా ఆర్థిక వ్యవస్థకు ఇది లాభదాయకంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



నిండుకుండలా సింగూరు ప్రాజెక్టు

**నారింజవాగు సంగారెడ్డి జిల్లా జీవనాడి...**
సంగారెడ్డి జిల్లాలోని ముఖ్యమైన వాగులలో నారింజవాగు ఒకటి. ఇది సింగూరు ప్రాజెక్టు కింద ఉన్నప్రాంతానికి సాగునీటిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. స్థానికరైతులు, ప్రజల జీవనానికి ఈవాగు ఒకజీవనాడి. నారింజవాగు ప్రధానంగా వ్యవసాయ అవసరాలను తీరుస్తుంది. దాని పరీవాహక ప్రాంతంలోని వేలాది ఎకరాల భూమి ఈవాగునీటిపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈవాగు పొంగిపొర్లడంవల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. దీంతో బోరుబావులు, బావుల్లో నీటిలభ్యతపెరిగి, రైతులకు ఎంతోలాభం చేకూరుతుంది. ఈవాగునీటితో వరి,చెరకు,మొక్కజొన్నవంటి పంటలను పండిస్తారు. నారింజవాగుపై చిన్నచిన్న చెక్‌డ్యామ్‌లు, జలాశయాలు నిర్మించడం వల్ల నీటిని నిల్వచేసి, ఎండాకాలంలో కూడా వ్యవసాయానికి ఉపయోగించుకునే అవకాశం ఉంది. కొన్ని గ్రామాలలో వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు తాగునీటి అవసరాలను కూడా తీరుస్తున్నాయి. ప్రభుత్వం మిషన్‌కాకతీయలో భాగంగా నారింజవాగుకు సంబంధించిన చెరువులు, కుంటలను పునరుద్ధరించడం వల్ల వాగునీటిని మరింత సమర్థవంతంగా ఉపయోగించుకునే వీలు కలిగింది.

# బొడ్మట్‌పల్లిని భారీవర్షంతో ముంచెత్తిన గుండువాగు..

☛ భయాందోళనలో గ్రామస్థులు..స్పందించిన మంత్రి దామోదర్ ☛ సమస్య పునరావృతం కాకుండా చూడాలని ఆదేశం



అర్ధరాత్రి గుండువాగు ఇళ్ళ మధ్యలోంచి పారుతున్న దృశ్యం



బాధితులను వివరాల తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**టేక్మాల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
ఆదివారంరాత్రి కురిసిన భారీవర్షానికి టేక్మాల్ మండలంలో రాకపోకలు నిలిచిపోయి జనజీవనం అస్తవ్యస్తంగామారి ప్రజానీకం అతలాకుతలమయ్యారు. 161 జాతీయరహదారిని అనుకొని ఉన్న టేక్మాల్ మండలపరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామాన్ని గుండువాగు ముంచెత్తింది. ఆప్రవాహానికి సుమారు 40 ఇళ్లలోకి, చౌరస్తాలో ఉన్న దుకాణాల్లోకి నీరుచేరినష్టంవాటిల్లింది. నీరుచేరడంతో నప్రజలు ప్రాణాలు అరచేతిలోపట్టుకొని రాత్రిమొత్తం జాగారం చేశారు. విషయం తెలుసుకున్నా, సంబంధిత అధికారులెవ్వరు ఆరాత్రి రాలేనిపరిస్థితి నెలకొంది. పోలీసులు గ్రామంలోకి ఇతరవాహనాలు రాకుండా బారికేడ్లను ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ మండల ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యతో ఫోన్లోనమాట్లాడుతూ ఆసమస్య పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను పిలిపించి ఆదేశాలను జారీచేశారు. విషయం తెలుసుకున్న మెదక్‌జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీఓ రమాదేవి గ్రామాన్ని సందర్శించి బాధితులను గూర్చి అడిగి తెలుసుకున్నారు. గుండువాగు నీరు గ్రామంలోకి రాకుండా చర్యలుతీసుకుంటామని ఇరిగేషన్ ఈఈ రవీంద్రకిషన్ అన్నారు.జెసిబిలనుపిలిపించి ఊళ్లోకి నీరురాకుండా కాల్వనుతీయించారు. ధనుర గ్రామ శివారులో ఉన్న చెరువుకట్ట పటిష్టంగా లేకపోవడంతో నీరంతా వృథాగా వెళ్తుందని గ్రామస్థులు అధికారులకు తెలియజేశారు. దీంతో అధికారులు సంఘటనాస్థలానికిచేరి మరమ్మతులుచేయించారు. చెరువులు,కుంటల అలుగులుపారి నిండుకుండలుగా తలపిస్తున్నాయి. గుండువాగు ఉప్పొంగడంతో మండలకేంద్రానికి వచ్చేదారులన్నీ జలదిగ్బంధంతో మూసుకుపోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పల్వంచ,ఎలకుర్తి,కోరంపల్లి,బర్ధీపూర్, కుసంగిలతోపాటు ఆయాగ్రామాల ప్రజలు, అధికారులు బొడ్మట్‌పల్లి మీదుగా మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. కురిసిన భారీవర్షానికి టేక్మాల్ మండలపరిధిలోని తంపులూరు గ్రామ శివారును అనుకొని ఉన్న నీరుడికుంటకు అలుగు సరిగ్గా లేకపోవడంతో కుంటలోకి వచ్చిన నీరంతా కట్టపై నుంచి దగ్గర ఉన్న ఇళ్లలోకి నీరు రెండోసారి వచ్చింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలా జరిగిందని గ్రామస్థులు అంటున్నారు. ఇందులో తహసీల్దార్ తులసిరాం, సిఐ రేణుకరెడ్డి, యస్ఐ రాజేష్, ఆర్ఐ సాయిశ్రీకాంత్, మండలపార్టీ అధ్యక్షులు రమేష్, ఇరిగేషన్ డిఈ సుబ్బలక్ష్మి, మండల యువజనకాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్‌గౌడ్,గ్రామపార్టీనాయకులు శంకరప్ప, వినోద్, గోపాల్, ధనుంజయ, తదితర సంబంధిత నాయకులున్నారు.

## ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తే సహించేదిలేదు

**-కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో గల బస్తీ దవాఖానను జిల్లా కలెక్టర్ కె.హైమావతి సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. హాజరుపట్టికను, లీవ్‌లెటర్లను పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఫీల్డ్ స్టాఫ్ నవీన్‌కుమార్‌తప్ప ఆసుపత్రిలో ఎవరూ లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హాజరుపట్టికను పరిశీలించి డిప్యుటేషన్లురద్దుచేశామని తెలిపారు.ఆసుపత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తంచేస్తూ అటెండర్ ఫక్రుద్దీన్‌పై కఠినచర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్ఓను ఫోన్‌లో ఆదేశించారు. సమయపాలనపాటించకుండా ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తే సహించేదిలేదన్నారు. ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు.



పట్టణంలో బస్తీదవాఖానను తనిఖీచేస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**ప్రజావాణి దరఖాస్తులకు అధికప్రాధాన్యతనివ్వాలి...**
ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుంచి దరఖాస్తులనుస్వీకరించి మాట్లాడారు. జిల్లా అధికార యంత్రాంగంపై విశ్వాసంతో ప్రజావాణి కార్యక్రమం ద్వారా తమ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఎంతోనమ్మకంతో సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందజేస్తారని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతిదరఖాస్తును పరిశీలించి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హామీద్, డిఆర్వో నాగరాజమ్మ, కలెక్టరేట్ ఎవో అబ్దుల్ రెహమాన్, వివిధశాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**-ఎస్ఐలు వినయ్‌కుమార్, నరేష్**

**జహీరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంతో పాటు కోహీర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించుకునే వినాయక మండపాలకు నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కె. వినయ్‌కుమార్, కోహీర్ ఎస్ఐ నరేష్‌లు వేరు వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రతిష్ఠించుకునే చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిష్ఠించుకునే వినాయకుల విగ్రహాలను విధిగా పోలీసులకు లింక్ ద్వారా తెలపాలని సూచించారు. తమ వద్ద సమాచారం ఉంటే మండపాల వద్ద భద్రత ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని, నిర్వాహకులు ఇందుకు సంబంధించిన సమాచారం తమకు అందించాలని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కె. వినయ్‌కుమార్, కోహీర్ ఎస్ఐ నరేష్‌లు పేర్కొన్నారు.

## రోడ్డుప్రమాదంలో తండ్రి మృతి, కుమారుడికి గాయాలు

**దుబ్బాక, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
అతివేగంతో, అజాగ్రత్తగా వస్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో తండ్రి మృతిచెందగా, కుమారుడికి గాయాలైన ఘటన దుబ్బాక మండలం హబ్సిపూర్ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటలోని కెసిఆర్‌నగర్లో నివాసముండే మంతూరి విఠల్ (55), ఆయన కుమారుడు చంద్రశేఖర్ వ్యక్తిగత పని నిమిత్తం టివిఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై దుబ్బాకకు వచ్చి తిరుగు ప్రయాణంలో సిద్దిపేటకు వెళ్తున్నారు. ఈక్రమంలో హబ్సిపూర్ విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో ఎన్‌హెచ్ 765 డిజి జాతీయ రహదారిపై సిద్దిపేటనుంచి డిచ్‌పల్లివైపు వెళ్తున్న స్విఫ్ట్‌కారు అతి వేగంతో, అజాగ్రత్తగావస్తూ, వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన తండ్రి, కుమారుడిని స్థానికులు 108 సిబ్బంది సహాయంతో సిద్దిపేట ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు తండ్రిని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన కుమారుడు చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ డిచ్‌పల్లి మండలం ధర్మారంకు చెందిన అభిమన్యుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం

## గోవా మద్యం బాటిళ్లు స్వాధీనం

**జహీరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
నియోజకవర్గ పరిధిలోని చిరాగ్‌పల్లి చెక్ పోస్టు వద్ద జాతీయ రహదారిపై సోమవారం వాహనాలను తనిఖీచేస్తున్న తరుణంలో గోవా నుంచి వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా 74 మద్యంబాటిళ్లు పట్టుబడ్డట్లు ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐ వీణరెడ్డి, ఎస్ఐలు హనుమంతు, రమేష్, మురళి, ఇబ్రహిం రాజా, ఉమారాణిలు ఉన్నారు.

## గణేష్ విగ్రహాల ప్రతిష్టాపనకు దరఖాస్తు చేసుకోండి

**-కేశంపేట సిఐ నరహరి**

**కేశంపేట ఆగస్టు 18 ప్రభాతవార్త :**
కేశంపేట మండల పరిధిలోని గ్రామాలలో గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన చేయదలచిన యువకులు కచ్చితంగా ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలి దరఖాస్తు చేసుకున్న కాపీని పోలీస్ స్టేషన్ కు సమర్పించాలని కేశంపేట సిఐ నరహరి తెలిపారు.

## సిపిఎస్ రద్దు చేయాలి




**పరిగి ఆగస్టు 18 ప్రభాతవార్త**
పరిగి నియోజకవర్గం, పూడూర్ మండల కేంద్రంలో సిపిఎస్ రద్దు చేయాలనే డిమాండ్ కొరకు హైదరాబాదులో చేపట్టే మహా ధర్నా కార్యక్రమ గోడపత్రికను పి.ఆర్.టి.యు. పూడూర్ మండల అధ్యక్షులు శివ కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు.. వారు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ ను అమలు చేయాలని, ఓపిఎస్ ఉద్యోగులకు మద్దతుగా నిలవాలని, ప్రభుత్వానికి చేరే వరకు పి.ఆర్.టి.యూ పోరాటం చేస్తుందన్నారు.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ , గౌరవ అధ్యక్షులు ప్రసాద్,రాష్ట్ర ఉపాధ్యక్షులు అంజిలయ్య, . రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి మాధవ రెడ్డి, భావన రూషి , జిల్లా బాధ్యులు శేఖర్, శివయ్య, శ్రీనివాస్ రావు, ఉమర్ ఖాన్, మాణిక్యచారి, సునందం రత్నం, పల్లవి, వాణి , మాలతి , వరలక్ష్మీ, రూహితబస్సుమ్, బిస్మిల్లా బేగం పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**కేశంపేట ఆగస్టు 18 ప్రభాతవార్త**
కేశంపేట మండల కేంద్రంలో ఘనంగా పోచమ్మ బోనాలను నిర్వహించారు. గ్రామస్తులు బోనాలతో డప్పు చప్పులతో శివసత్తుల ఆటపాటలతో, సన్నాయి మేళాలతో గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించి వారి ముక్కులను చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురిసి పాడిపంటలు బాగా పండి గ్రామ ప్రజలందరూ చల్లగా ఉండేలా దీవించమని అమ్మవారిని వేడుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## రవీందర్‌రెడ్డి సేవలు అభినందనీయం



సోమవారం ప్రభుత్వ గోదాం వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తున్న జెసిబి

**నవాబుపేట,ఆగస్టు 18 ప్రభాతవార్త**
మండల పరిధిలోని పులుమామిడి గ్రామానికి చెందిన రత్నమొళ్ళ రవీందర్‌రెడ్డి నిస్వార్థంతో చేస్తున్న సేవలకు గాను పలువురి చేత ప్రశంసలు పొందుతున్నారు. ఆయన చేతనైనంత సహాయం చేయడం పట్ల పలువురు అభినంధిస్తున్నారు. తన వద్దనున్న జేసిబి, టిప్పర్‌లతో సహాయంతో సాధ్యపడే పనులను నిర్వహించడం, అవసరమైన సందర్భంలో స్వంత డబ్బులను వ్యచ్చించి పనులు చక్కబెడుతున్నారు. దాదాపుగా 15 సంత్సరాల ఆయన మండలంలో ఆయన సేవసంధిస్తున్నారు. మండల కేంద్రంలో పోలీసు స్టేషన్‌కు ఒక వైపు ప్రహారి గోడను నిర్మింపజేశారు. ఆయా ప్రభుత్వ పాఠశాలలకు బ్యాండు పరికరాలు, బల్లలు, బెంచీలు, సమకూర్చడంతో పాటు పాఠశాల ప్రాంగణాల్లో పిచ్చి మొక్కల తొలగింపు, గుంతలు పూడ్చడం, అదేవిధంగా ఆయా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం చేడయడం లాంగి పనులను నిర్వహిస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు ఎలుకల బెడదను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటచే కారణమని భావించిన తరుణంలో స్పంధించిన రవీందర్‌రెడ్డి వెంటనే ఆయనకు సంబంధించిన జేసిబి సహాయంతో పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించారు. దీంతో విద్యార్థులకు ఎలుకల బెడద నుండి విముక్తిని కల్పించారు. అందుకు గాను పలువురు ప్రశంసించారు. స్వగ్రామంలో ప్రజలకు ఏదైనా సాముహిక సమస్య ఉంటే వెంటనే స్పంధించి వాటిని త్వరగతిన పరిస్కారం చేయడం రివాజు. ప్రధాన కూడలళ్ళ వద్ద గ్రామస్తులు సేద తీరడానికి సిమెంట్‌తో తయారు చేసిన బెంచీలను ఏర్పాటు చేశారు. రైతు రోడ్లను చదును చేయడం వాటిపై మట్టిపోయించి రాకపోకలకు అనుకూలంగా పనులు చేయించడంతో రైతులు సహితం ఆయన సేవలను అభినంధించారు. ఈ విధంగా ఆయన వివిధ రకాల సేవలను అంధిస్తూ రత్నమొళ్ళ రవీందర్ (త్రిపుల్‌ఆర్) పేర ఆయన ఆయా సేవలు అంధిస్తు ప్రజ ఆధరణ పొందుతున్నారు. డబ్బులు చాల మంది వద్ద ఉంటాయి కానీ సేవాగుణం కొందరికే ఉంటుంది. నిస్వార్థంతో అంధిస్తున్న రవీందర్‌రెడ్డి సేవలు అభినందనీయమని పలువురు అంటున్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అందరికీ ఆదర్శనీయుడు

**- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**



పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త :**
ట్యాంక్ బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్నగౌగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనుండటం హర్షనీయమని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తెలంగాన బహుజన రాజ్యస్థాపకుడు సర్ధార్ సర్యాయి పాపన్నగౌగ్ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో కలెక్టర్ ముఖ్య అతిధిగా హజరైయ్యారు. అనంతరం పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కలవృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తూ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత బహుజన మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించారని తెలిపారు.కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలనే సమసమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో నాటి కాలంలోనే పాపన్నగౌడ్ పోరాటం గొప్ప విషయమని అన్నారు. సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ అందరికీ ఆదర్శనీయుడని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్ఓ సంగీత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అదికారి కేశూరాం, బీసీ ఫ్రంట్ నాయకుడు మల్లేష్ యాదవ్, సుధాకర్ గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ప్రజా వాణిలో వచ్చే ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదుల ు వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులను తమ సమస్యల ు కలెక్టర్‌కు విన్నవిస్తూ భూ సమస్య లు, ఇందిరమ్మ ఇల్లు, ఎలక్ట్రిసిటీ, గ్రామ పంచాయతి, విద్యా శాఖ, ఆసరా పెన్షన్‌లకు సంబందించి ఫిర్యాదులు సమర్పించారు. ప్రజా ఫిర్యాదులు సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలు వివరిస్తూ ఫిర్యాదు దారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. జిల్లాలో జరిగే స్కూల్స్ పేయింటింగ్ పనులు, మైనర్ రిపేర్ పనులు, బయో మెట్రిక్ అటెండెన్స్, ప్యాడి ప్రోక్యూర్ మెంట్, విద్యుత్తు పలు అంశాల పై సంబంధిత అధికారులతో అరా తీశారు. బయో మెట్రిక్ అటెండెన్స్ వంద శాతం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డీఆర్ఓ మంగీలాల్, ఆర్‌డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అంబురామన్న జాతరకు పోటెత్తిన భక్తజనం

**-శివనామ స్మరణతో మారుమోగిన ఆలయ పరిసరాలు**
**-అవాంచనీయ సంఘటనలు జరుగకుండా భారీ పోలీసు బందోబస్తు**



జాతరకు హాజరైన భక్తజనం



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

**పెద్దేముల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండలం తట్టెపల్లి అటవీప్రాంతలో వెలిసిన అంబురామన్న జాతరకు భక్తజనం పోటెత్తారు. శ్రావణమాసంచివరి సోమవారం కావడంతో వికారాబాద్, హైద్రాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, సంగారెడ్డి జిల్లాలో నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొని అంబురామేశ్వరుడి దర్శనం చేసుకున్నారు. శ్రావమాసం ప్రారంభం నుంచి చివరి వరకు ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు స్వామి వారి దర్శన అనంతరం విరమింపచేశారు. దట్టమైన అటవీప్రాంతంలో వెలిసిన అంబురామేశ్వరుడి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ప్రారంభం నుంచే నిత్యాన్నదానాన్ని నిర్వహించారు. భక్తుల కోలహలం, భజన సంకీర్తనలతో ఆలయ పరిసరాలు శివనామ స్మరణతో మారుమోగాయి.భక్తులకు అన్ని రకాల వసతులను ఆలయ కమిటి అధ్యక్షుడు వెంకటేశం తదితరులు ఏర్పాట్లు చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంచనీయమైన సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వేణుకుమార్ తెలిపారు.

**అంబురామన్న ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి**
**: చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి**

అంబురామేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం తట్టెపల్లి అంబురామేశ్వరుడిని పట్నంమహేందర్‌రెడ్డి దర్శించి పూజలు నిర్వహించారు. ఆయన వెంట రాష్ట్ర టీపీసీసీ ప్రచారకర్త కరణం పురుషోత్తంరావు, జి.రవిందర్, కేశవరావు, తదితరులుఉన్నారు. ఎంఎల్‌సికి స్వాగతం పలికిన వారిలో ఆలయ కమిటి అధ్యక్షులు యు.వెంకటేశం, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కొండపురం గోపాల్, సొసైటిఉపాధ్యాక్షులు అంజయ్య, డీలర్ అంజయ్య, మాజీ వైస్ యంపిపి లక్ష్మన్, నర్సిములు, శంకర్‌నాయక్, భగవాన్, సాబేర్, తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్‌తదితరులు ఉన్నారు.

## రోడ్డు కబ్జాను తొలగించాలి

**-కాలనీవాసులకు న్యాయం చేయాలి**
**-తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద రెడ్డి కాలనీవాసుల ఆందోళన**



తూంకుంట మున్సిపల్ ఆఫీస్ వద్ద రెడ్డి కాలనీవాసులు కాలనీలో రోడ్డు కబ్జాను తొలగించాలని బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేసి ధర్నా చేయగా పాల్గొని మద్దతు తెలిపిన మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్,తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఆగస్టు 18, ప్రభాతవార్త**
తూంకుంటలోని రెడ్డి కాలనీ వద్ద వెంఛర్ రోడ్డును కబ్జా చేశారని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు కబ్జాను తొలగించాలని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేసి ధర్నా చేశారు. సోమవారం శామీర్‌పే మండలంలోని తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద తూంకుంటలోని రెడ్డికాలనీ వద్ద రోడ్డును కొందరు కబ్జా చేసి రోడ్డులో బోరు వేసి మామిడి చెట్లను నాటారని వారు ఆరోపిస్తూ ఆ కాలనీవాసులు అందోళన వ్యక్తం చేశారు. వీరికి రెడ్డి అసోసియేషన్, బాధిత కుటుంబాల వారికి తూంకుంట గ్రామ మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్ మద్దతు తెలిపి వెంటనే రెడ్డి కాలనీ వద్ద రోడ్డును కబ్జా చేసిన దాన్ని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కబ్జాను తొలగించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌కు, టిపిఓకు పలుసార్లు తెలిపినా పట్టించుకోవటం లేదని తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. వెంటనే రోడ్డు కబ్జాను తొలగించాలని ఆయన కోరారు. తూంకుంటలోని ఆ వెంఛర్‌లో సుమారు 133ప్లాట్లు చేశారని, వీటిలో ఇప్పటి వరకు 30 కుటుంబాలు నివాసాలు ఉండి ఇళ్ల నిర్మాణాలు చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. మరో 30మంది వరకు ఇళ్ల నిర్మాణాల కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారని అన్నారు. అయితే అయితే రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన వ్యక్తి గూడురు సత్తిరెడ్డి అనే వ్యక్తి మరొకరు వెంకట్‌రెడ్డిలు రెడ్డికాలనీ రోడ్డును కబ్జా చేసి రోడ్డును మూసివేశారని, దారిలోనే బోరు వేసి మామిడి చెట్లను నాటారని అన్నారు. దీంతో కాలనీవాసులు అందరం కూడ బయటకు అవసరాలకు వెళ్లాలన్నా, పిల్లలకు స్కూల్‌కు వెళ్లాలన్నా బస్సులు రావటానికి దారి లేక పోవటంతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేరే వారి ప్లాట్ల నుంచి దారి చేసుకుని రాకపోకలు బయటకు నిర్వహిస్తున్నామన్నారు. ప్లాట్ల వారు కూడ తమ పాట్ల నుంచి వెళ్లవద్దని అంటున్నారని, దీంతో మాకు దారి అనేది లేకుండా పోతుందన్నారు. ఈ విషయంపై కమిషనర్‌కు, టిపిఓకు, తహసీల్దార్‌కు, జిల్లా అదనపు కలెక్టర్‌కు, కలెక్టర్‌కు కూడ ఫిర్యాదు చేశామని సంబంధిత అధికారులు స్పందించకపోవటం భాదాకరమని ఆ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నాకర్ పేర్కొన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు,టిపిఓ, మున్సిపల్ కమిషనర్ స్పందించి రోడ్డు కబ్జాను తొలగించాలని కోరారు. ఆ తరువాత జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి రోడ్డు కబ్జాను తొలగించాలని వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని రెడ్డి కాలనీ అసోసిషియేషన్ వారు, బాధిత కుటుంబాల వారు కలిసి అందజేసి న్యాయం చేయాలని కోరారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## పండగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**శాంతి సమావేశంలో సిఐ, మున్సిపల్ కమిషనర్**



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ యోగేష్

**శంకర్ పల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
పండగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని శంకర్‌పల్లి సిఐ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ యోగేష్ అన్నారు. మున్సిపల్ పరిధిలో వినాయక ఉత్సవాలు నిర్వాణపై మణి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...నిబంధనలు పాటిస్తూ వినాయక ఉత్సవాలను నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేయాలని రోడ్డు మధ్య ప్రదేశాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసి వివాదాస్పద వాతావరణం కల్పించవద్దని, వాన దారులకు, ప్రజలకు అంతరాయం కల్పించొద్దని, పోలీసుల సలహాలు సూచనలు పాటించాలని, ప్రతి ఒక్కరు ఐక్యమక్యంగా ఉండాలనే ఆలోచనతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించాలని, యూత్ సభ్యులు గణేష్ నవరాత్రి ఉత్సవాలను సామరస్యంగా ఎటువంటి గొడవలు లేకుండా ఉత్సవాలు నిర్వహించి ప్రశాంతంగా నిమర్జన కార్యక్రమాలు పూర్తి చేయాలని సీఐ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ యోగేష్, ఎలక్ట్రికల్ ఏఈ ప్రదీప్ కుమార్, మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, పోలీస్ శాఖ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది, వినాయక మండపాల సభ్యులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ జోగు రమేష్

**తలకొండపల్లి ఆగస్టు 18 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో సోమవారం నాడు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు అయిన చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. తలకొండపల్లి గ్రామానికి చెందిన శ్రీవల్ల అంజలికి మంజూరైన 60 వేల రూపాయల చెక్కును, పడకల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుర్రంపల్లి రాములు కు మంజూరైన 36వేల రూపాయల చెక్కును వారు అందజేశారు. ఇటీవల వారు అనారోగ్యానికి గురై హైదరాబాదులోని ప్రవేట్ ఆసుపత్రిలో వైద్యం కోసం ఖర్చు చేయడంతో వారికి మంజూరైన చెక్కులను అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఎంతోమంది నిరుపేదలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ ఎఫ్ కింద చెక్కులు మంజూరు చేయించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పడకల్ మాజీ ఎంపీటీసీ జోగు రమేష్, నాయకులు జో రామచంద్రయ్య బాలరాజ్ చెన్నయ్య తిరుపతి గౌడ్, బురుగళ్ళ నరసింహ, బండగల రమేష్, దాసరి అంజయ్య, తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవంచ నరసింహ రాజు రెడ్డి, నాయకులు అజీమ్ రవీందర్ బోల యాదగిరి మల్లేష్ సురేష్ అస్వప్రాల శీను యాదగిరి గణేష్ తదితరులున్నారు.

## కట్ట మైసమ్మ, గంగమ్మ తల్లులకు ఘనంగా పూజలు

**-అందర్నీ చల్లంగా చూడు తల్లి : పల్లె ఆనంద్ కుమార్**



**కేశంపేట ఆగస్టు 18 ప్రభాతవార్త**
సమృద్ధిగా పంటలు పండి పిల్లా పాపలు చల్లగా ఉండేలా దీవించమని సోమవారం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామ పెద్ద చెరువు నిండి అలుగు పారుతుండడంతో కట్ట మైసమ్మ , గంగమ్మ తల్లులకు గ్రామ ప్రజలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పల్లె ఆనంద్ కుమార్. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వరుసగా నాలుగు సార్లు చెరువు నిండి అలుగు పారుతుండడంతో గ్రామస్తుల ఆనందాలు వెల్లి విరిసాయని ప్రతి సంవత్సరం ఇదే విధంగా సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువు నిండి పాడిపంటలతో సుఖ సంతోషాలతో గ్రామ ప్రజలు జీవనం కొనసాగించే విధంగా చూడాలని దేవతలను వేడుకున్నట్లు పల్లె ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పామ్ శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, మాజీ డిప్యూటీ సర్పంచులు సూరం శ్రీనివాస్, పెబ్బే శివకుమార్, కుమ్మరి సత్యనారాయణ, గోవర్ధన్ రెడ్డి, శ్యాం కుమార్, ఏర్పుల లింగం ముదిరాజ్, ఇటమోని బాలరాజ్, మంద వెంకటయ్య, రామోజీ, సూరం శేఖర్, బుర్రి మల్లేష్ గౌడ్, కుమ్మరి కరుణాకర్, ఎ శీను, వట్టెల శ్రీశైలం, పల్లె యాదయ్య, ఏర్పుల లింగం, శంకరయ్య, అంజయ్య, జంగయ్య, వరుణ్ గౌడ్, డీజే మల్లేష్, మల్లయ్య, రామస్వామి,శ్రీశైలం, గ్రామస్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిసి కమిషన్ చైర్మన్‌ను కలిసిన ముదిరాజ్ నాయకులు



బిసి కమిషన్ చైర్మేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ నాయకులు

**కొడంగల్,ఆగస్టు 18ప్రభాతవార్త**
బీసీ డీ గ్రూపు నుండి బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని జీఓ 15 అమలు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు వారు సోమవారం బీసీ కమీషన్ చైర్మేన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజ్‌లు అన్ని కులాల కన్న అత్యధిక జనాభా ఉండి ఆర్ధికంగా,సామాజికంగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లకు సానుకూలంగా ఉన్నారని ప్రత్యేక చొరవ తీసుకొని కమీషన్ రిపోర్ట్ ప్రభుత్వానికి ఇస్తే ప్రభుత్వం బీసీ డీ నుండి బీసీఏ గ్రూపులోకి మార్చడానికి సిద్ధంగా ఉందని కమీషన్ ముందు ముదిరాజ్ నాయకులు విన్నవించారు.ఈ కార్యక్రమంలో బీసీ కమీషన్ చైర్మేన్ నిరంజన్,బీసీ కమీషన్ మెంబర్ రాపోలు జయప్రకాష్,కొడంగల్ నియోజకవర్గ ముదిరాజ్ నాయకులు వేణుగోపాల్,మెర్గు వెంకటయ్య, నర్సప్ప, బాలయ్య, సత్యపాల్,వెంకటయ్య,పొల్కంపల్లి మధుసుదన్,హన్మంతు,పకీరప్ప పాల్గొన్నారు.

## పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

**కొడంగల్ రూరల్, ఆగస్టు 18 (ప్రభాతవార్తః** కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ హైస్కూల్‌లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలతో ఆకట్టుకున్నారు. కృష్ణాష్టమి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యకమ్రాల్లో పాల్గొన్న విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్, వ్యవస్థాపకులు వెంకటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రహదారిపై .. ప్లాస్టిక్ వ్యర్థాల పారబోత

**పట్టించుకోకుంటే.. పరిషానే**



నందిగామ పాద జాతీయ రహదారిపై పారబోసిన ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు.

**నందిగామ ఆగస్టు 18 ప్రభాతవార్త**
అసలే జల వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఇష్టానుసారంగా ప్లాస్టిక్ వ్యర్థాలను పారబోయడంతో సరికొత్త సమస్యగా దాపరించింది. మానవ మనుగడకే ప్రశ్నార్థకంగా మారిన ఈ ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరు కంకణం కట్టుకోవాల్సిన అవసరం ఉంది. నందిగామ మండల కేంద్రంలో ఉన్న పాత జాతీయ రహదారిపై ప్లాస్టిక్ వ్యర్థాలను పారబోశారు. నందిగామలో కొందరు చికెన్, మటన్ మాంసపు పదార్థాలను తీసిన వ్యర్థ పదార్థాలను, పాసిన ఆహార పదార్థాలను మూటగటి కల్వర్టుల వద్ద , వంతెనల వద్ద పడేసి వెళ్తున్నారు. ఈ వ్యర్థాలలో వచ్చిపోయే బాటసారిలకు, వాహనదారులు దుర్వాసనతో ఇబ్బందులు ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వ్యర్థాలను పారబోసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**మండల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్ర శేఖర్ నాయి**

**నందిగామ ఆగస్టు ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నందిగామ మండల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జరుపుల చంద్రశేఖర్ నాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమి, బుట్టలేని నాయి బ్రాహ్మణులు కేవలం కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వాలు మారిన, పాలకులు మారిన, వెనుకబడిన నాయి బ్రాహ్మణులు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయి బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించడం కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ లో ఏర్పాటు చేయబోయే నామినేటెడ్ పదవుల్లో నాయి బ్రాహ్మణులకు అవకాశాలు కల్పించాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నాయి బ్రాహ్మణులకు న్యాయం జరుగుతుందనే భరోసా, విశ్వాసంతో ఉన్నామన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన నరేందర్ రెడ్డి

**షాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక వసతులు ఉన్నప్పుడే వారు విద్యలో రాణించగలరని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేష్ గౌడ్ అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని ఎల్గొండగూడ గ్రామ మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు గ్రామస్తుడు నరేందర్ రెడ్డి నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ఎరేజర్, స్కేల్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా రాణించాలని సూచిం చారు. విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నప్పుడే వారు విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించి, ఈ పోటీ ప్రపంచంలో ముందు ఉండగలరని తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకారం అందించాలన్నారు. ఎల్గొండగూడ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన వసతులు కల్పించేందుకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామస్తులు ఉన్నారు.

## ఘనంగా బాలలక్ష్మీనరసింహస్వామి కళ్యాణమహోత్సవం

**మర్కుక్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని గణేష్‌పల్లిగ్రామ శ్రీబాలలక్ష్మీనరసింహస్వామి దేవ స్థానంలో సోమవారం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన నవగ్రహపూజ, హోమం లో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం తెలిపారు. అనంతరం హాజరైన అతిథులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, మాజీ ఎంపిటిసి గోలి నరేందర్, స్థానిక మాజీ సర్పంచ్ మంజుల శ్రీరాం, తీగుల్ మాజీ సర్పంచ్ కవ్వర భానుప్రకాష్‌రావు, నాబార్డు డైరెక్టర్ కూచారం సంతోష్, హనుమంతరెడ్డి, కొండపోచమ్మ డైరెక్టర్ ఆశయ్య, నాయకులు రాంరెడ్డి, మల్లేశం, బుర్రి రాజు, పూసల రవి, భక్తులు పాల్గొన్నారు.

## నిండు కుండలా మంజీరా నది

**మనూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని పుల్‌కుర్తి, రాయిపల్లి గ్రామాల శివారులోని మంజీర వంతెన వద్ద మంజీర నది నిండు కుండలా పారుతోంది. మండలంతో పాటు పక్కనే ఉన్న కర్నాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ నుంచి వరద నీరు మంజీరా నదిలోకి చేరుకుంటుండటంతో మంజీరా నది వారం రోజుల్లో నిండుకుండలా మారిపోయింది. రైతులు సాగు చేసుకుంటున్న పంటలు నీటి పాలవడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని చెప్పడం అతిశయోక్తి కాదు. నీట పాలైన పంటలు ఎర్రగా మారుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## యూరియా కోసం బారులు తీరిన రైతులు

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

హుస్నాబాద్ విశాల సహకార పరపతి సంఘం ఎదుట సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. రోజుల తరబడి సొసైటీ ఎదుట బారులు తీరుతున్న యూరియా బస్తాలు దొరకడం లేదని రైతులు వాపోయారు. రైతులకు మద్దతుగా స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రైతులు యూరియాకోసం చెప్పులుపెట్టి క్యూలైన్లో నిలబడే పరిస్థితి 2014కుముందు, తర్వాత ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులోనే వచ్చిందన్నారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు యూరియా కొరతలేకుండా సరిపడా యూరియాను వెంటనే అందించాలన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**నాగల్‌గిద్ద, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని షాపూర్ శివారులోని మంజీర పరివాహక ప్రాంతాన్ని సోమవారం అధికారులు పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా పెట్టెకుని తహసీల్దార్ శివకృష్ణ,ఎంపిడిఓ, ఎస్ఐలతో కలిసి పరిశీలించి ప్రజల పలు సూచనలు చేశారు. అత్యవసరమైతే ప్రజలు అధికారులను సంప్రదించాలని మండల ప్రజలకు తహసీల్దార్ సూచించారు.

## మత్తడి దూకుతున్న లింగం చెరువు

**-నిండు కుండలా చెరువులు, కుంటలు**

**చిలిపిచెడ్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

గత రెండు, మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు చిలిపిచెడ్ మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు నిండు కుండలా తయారయ్యాయి. ఈ మేరకు మండల కేంద్రం లోని గల సోమక్కపేట గ్రామ లింగం చెరువు లోకి నీరు అధికంగా చేరి మత్తడి దుకుతుంది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వర్షాలను వాతావరణాన్ని పొన్ని వచ్చి చూస్తున్నారు. అధికారులు కురుస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు ఎవరు చేపల వేటకు వెళ్లవద్దని మండల ప్రజలకు పోలీసులు సూచించారు. అదేవిధంగా మండలపరిధిలోని చాముండేశ్వరిఆలయంముందు ప్రవహిస్తున్న మంజీరా నదిని అదనపు కలెక్టర్ నగేశ్ పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు.

## కేంద్ర రైల్వేబోర్డు చైర్మన్‌ను సన్మానించిన ఎమ్మెల్సీ

**రామచంద్రాపురం, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

కేంద్ర రైల్వే బోర్డు చైర్మన్ కృష్ణదాసును సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డిలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. చైర్మన్ తమ ఇంటికి ఆహ్వానించి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి ఉపాధ్యక్షులు ముత్తిరెడ్డి, ప్రతాపరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజురాథోడ్, సదాశివపేట పట్టణ అధ్యక్షులు ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## మంచిగా చదువుకొని ఉన్నతస్థానాలకు చేరుకోవాలి

**-ఎసిప లక్ష్మారెడ్డి**

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావివ్వకుండా మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని హుస్నాబాద్ ఎసిప లక్ష్మారెడ్డి సూచించారు. హుస్నాబాద్‌పట్టణంలోని మంటెస్సెరి హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు మహిళల రక్షణచట్టాలు, సైబర్‌నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అవసరం మేరకే సోషల్ మీడియాను ఉపయోగించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళారక్షణకు పెట్టిన చట్టాలను దురుపయోగం చేయడం జరుగు తుందన్నారు. సూతనచట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకో వాలన్నారు. మహిళల రక్షణకు షీటీమ్స్ ఎల్లప్పుడు ముందుంటున్నాయన్నారు. ఎవరైనా వేధింపులకు అవహేళనగా మాట్లాడిన కావాలని వెంబడించిన వెంటనే డయల్ 100 లేదా షీటీమ్ నెంబరు 8712667434 సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మమ్మద్ అబ్దుల్, ఉపాధ్యాయులు, షీటీమ్ బృందం, కానిస్టేబుల్ ప్రశాంతి, స్వప్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో మండలంలోని చెరువులకు వరద

**-పరిశీలించిన తహసీల్దార్, చర్యలకు ఆదేశాలు**

**హత్నూర, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

ఎగువనుండి భారీగా వస్తున్న వరదనీటితో హత్నూరమండలంలోని ఎల్లమ్మ గూడనుండి కోడిపాకకు అనుసంధానించే రహదారిపై నీరు పొంగిపొర్లుతుం డటంతో ఈ రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు హత్నూర తహసీల్దార్ ఫర్హీన్ షేక్ తెలిపారు. సోమవారం తాసిల్దార్ ఫర్హీన్ షేక్, హత్నూర ఎంపీడీవో శంకర్, ఎంపిఓ యూసుఫ్, ఎస్ఐ శ్రీధర్ రెడ్డిలతో కలిసి నీటిపరివాహక ప్రాంతాలను సందర్శించారు, నర్సాపూర్ మండలం, కాగజ్‌మద్దూర్ ట్యాంక్ ఎగువనుండి భారీగా ఇన్‌ఫ్లోవస్తుందని, నీటిప్రవాహ తీవ్రతను తగ్గించడానికి నీటిని మళ్లించామని అన్నారు. భారీ నీటి ప్రవాహం కారణంగా ఎల్లమ్మగూడలోని ఒక కోళ్ల ఫారం మునిగిపోయిందని, దీని ఫలితంగా దాదాపు 3000 కోళ్ల చనిపోయాయని తెలిపారు. తనిఖీ నివేదికను జిల్లా అధికారులకు సమర్పించడం జరుగుతుందని తహసీల్దార్ అన్నారు. ముచ్చెర్ల, గుండ్లమాచనూర్ గ్రామాలలో సోమవారం రెండు ఇళ్ళు పాక్షి కంగా దెబ్బతిన్నాయని తెలిపారు.

## టేక్మాల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**టేక్మాల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధన సమితి టేక్మాల్ మండల శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు టేక్మాల్ మండల కేంద్రంలోని స్థానిక గాంధీభవన్‌లో, బొడ్మట్‌పల్లిలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్, ఆయాపార్టీలనాయకులు, ఆకులపల్లి పాపయ్య, రాజేష్ గౌడ్, నాయికోటి భాస్కర్, మజర్, చింత రవి, కమ్మరి సిద్దన్న, అఖిల సాగర్, వల్లులిల్, సేవాలాల్, సక్కనాయక్, సర్దార్, సంతోష్, ఆయా గ్రామాల గౌడ సంఘం నాయకులు, మనోహర్‌గౌడ్, సత్యగౌడ్, అనిల్‌గౌడ్, తుకారాంగౌడ్, నరేష్‌గౌడ్, నాగరాజ్‌గౌడ్, రాజుగౌడ్, సంపత్‌గౌడ్, వెంకట్ గౌడ్, సాయిశేఖర్ గౌడ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సమాచారం ఇవ్వండి..వెంటనే పరిష్కరిస్తాం

**-మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్**

**నారాయణఖేడ్, ఆగస్టు 18 ప్రభాతవార్త:**

భారీగా వర్షాలు కురుస్తుండడంతో కాలనీలలో ఇబ్బందులు ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు.ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో నారాయణఖేడ్ పరిధిలోని మనసుర్‌పూర్ వాగువద్ద వంతెనపై మనుసుర్‌పూర్ గ్రామానికి వెళ్లడానికి వరదనీరు అడ్డంగా వచ్చిన మొద్దులను జెసిబి ద్వారా తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది కమిషనర్ జగ్జీవన్. నారాయణఖేడ్ పట్టణంలో గత నాలుగైదురోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు మున్సిపల్ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి రోడ్లపై వర్షం నిలిచిన వాటిని మురికి కాలువలోనికి మళ్లించి రాకపోకలకు వెంటనే సౌకర్యంకలిపిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలకు ఇచ్చారని శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. భారీ వర్షం కురవడం వల్ల మనస్పూర్ గ్రామానికి వెళ్లడానికి భారీగా వాగులో నీళ్లు రావడంతో అందులో అడ్డంగా నిలిచిన ముద్దులను ఇతర చెత్తచెదారాన్ని జెసిబి ద్వారా తొలగిస్తున్నట్లు పైన తెలిపారు. అదేవిధంగా అన్ని వాటిల్లోనూ మున్సిపాలిటీ పరిధిలోని ఎక్కడ ఏమి జరిగిన వెనువెంటనే మున్సిపాలిటీసిబ్బంది అందుబాటులో ఉండి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటున్నామన్నారు. ఇందుకోసం ప్రజలు కూడా జాగ్రతగా ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు. వర్షాలుకురుస్తున్నప్పుడు బయటకురావద్దని చెత్తా చెదారం చెత్తబుట్టలువేసుకొని మున్సిపల్ వాహనాలు వచ్చినప్పుడు అందులోవేయాలని మున్సిపాలిటీ వాహనాలు రెడీగా ఎల్లప్పుడూ ఉంటున్నాయని జెసిబిలు అందుబాటులో ఉండి రోడ్లపైనీళ్లు నిలిచినా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్ కింద మున్సిపల్ సిబ్బందిని అందుబాటులో ఉంచామని వర్షాలు బంద్ అయ్యేవరకు ఎల్లప్పుడు ఇక్కడ ఏమి జరిగిన కమిషనర్‌కు సమాచారం ఇచ్చిన వెంటనే సిబ్బంది వచ్చి వాటిని పరిసరించుటకు సిద్ధంగా ఉన్నామని శానిటేషన్ ఇన్స్పెక్టర్ పట్టణ ప్రజలకు తెలిపారు ఈ విషయాన్ని గమనించి పట్టణ ప్రజలందరూ మున్సిపల్ అధికారులకుసహకరించి ఏదైనాసమస్య ఉంటే సమాచారం అందించాలని తెలిపారు.

## ప్రజారక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలి

**-సిపి డాక్టర్ అనురాధ**

**మిరుదొడ్డి, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని సీపీ డాక్టర్ అనురాధ సూచించారు. మిరుదొడ్డి పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను,రిసెప్షన్ రికార్డు,రైటర్ రూంను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ డాటాను ఏరోజు ఆ రోజు అప్‌డెట్ చేసుకోవాలన్నారు.ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నీతి నిజాయితీగా విధులు నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆమె వెంట సిద్దిపేట ఎసిపి రవీందర్‌రెడ్డి, దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌బి సిఐ కిరణ్, మిరుదొడ్డి ఎస్ఐ సమత, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

**కూడవెల్లి వాగు వరద ఉధృతిని పరిశీలించిన సిపి...**

మండల పరిధిలోని అల్వాల శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న కూడవెల్లి వాగును సీపీ డాక్టర్ అనురాధ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూడవెల్లి వాగుకు ఇరువైపులా కోన్స్ ఏర్పాటు చేసి రోప్ కట్టడం జరిగిందన్నారు. వాగుకు ఇరువైపుల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరద ఉధృతి తగ్గేవరకు పోలీసుబందోబస్తు కొనసాగుతుందన్నారు. జిల్లా ఎక్కడైనా వాగులు,వంకలు, పొంగి పొర్లుతే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. గ్రామస్తులు ఎవరు వాగు దాటే ప్రయత్నం చేయొద్దన్నారు. చేపలు పట్టడానికి వెళ్లొద్దొన్నారు. ఆమె వెంట ఎసిపి,సిఐలు, ఎస్ఐ తదితరులు ఉన్నారు.

## కోతకు గురైన రోడ్లు అయోమయంలో తాండవాసులు

**కంగ్టి, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

కంగ్టి మండలం సుక్కల్ తీర్థ్ పరదిలోని తూకరం తాండ, అదేవిదంగా కంగ్టి ముకుంద నాయక్ తాండ రోడ్డు భారీగా కురిసిన వానకు కోతకు గురైందని తాండ వాసులు తెలిపారు, వారు మాట్లాడు తు ద్విచక్ర వాహనాలు, దాట డానికి కూడా ఇబ్బంది గా ఉందని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సు కూడా ఈ దారి గుండా రాలేవని, జరగరాని సంఘటన జరగుతే మా పరిస్థితి ఏంటిదని, తూకారామ్ తాండవాసులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు, తాండకు కంగ్టి నుండి నారాయణఖేడ్ వేళ్ళు రోడ్డు తుర్క వడగవ్ నుండి సాధుతాండ మీదుగా, రోడ్డు పాడయ్యిందని, మరొక దారి రాజారామ్ తాండ నుండి వచ్చే రోడ్డు అధిక వర్షం పడడంతో వాగు దగ్గర రోడ్డు కోతకు గురైం దని రెండు దిక్కులగుండా దారిలేకపోతే ఎలానని, ప్రశ్నిస్తున్నారు, స్వాతంత్ర్యంవచ్చి 79 సంవత్సరం ఐనా మా గిరిజనుల బతుకులు మారలేవని తెలిపారు.

## కద్పల్ చెరువుకు గండి-పూడ్పించిన తహసీల్దార్

**సిర్గాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కద్పల్ గ్రామ శివారులోని కిచ్చేరు చెరువుకు రాత్రి కురిసిన వర్షానికి గండి పడింది. చెరువకు గండి పడినట్టు తెలుసుకున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్ అధికారులను అప్రమత్తంచేసి గండికి మరమ్మతు పనులు చేయించారు. ఈచెరువు నుంచి పరిసర ప్రాంతాల్లోని 100 ఎకరాలకు సాగునీరు అందుతుంటుంది.చెరువుకుపడినగండిని పూడ్పించిన తహసీల్దార్‌కు, అధికారులు ఆర్ఐ మదన్‌మోహన్, ఇరిగేషన్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## 5గేట్ల ద్వారా దిగువకు సింగూరు నీరు విడుదల

**పుల్‌కల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

సింగూరు ప్రాజెక్టు నుంచి 5 గేట్లు ఎత్తివేసి దిగువకు వరద నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టుకు వరద పోటు తగ్గకపోతుండటంతో ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహాన్ని ప్రాజెక్టు 5 గేట్లు ఎత్తివరత ప్రవాహాన్ని దిగువకు పంపుతున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 37059 క్యూసెక్కులు వస్తుండగా 43541 క్యూసెక్కుల వరదను 6,8,9,10,11 క్రస్ట్ గేట్లు, ఎత్తి రెండు జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వార దిగువకు వదులు తున్నారు. ఆనకట్ట భద్రతను నీటి పారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడుపరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

## కొట్టుకొచ్చనకారు-తొలగించిన ప్రజలు

**సిర్గాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కుంటలు పొంగి పొర్తుతున్నాయి. మండల పరిధిలోని వాసర్ గ్రామ శివారులోని ఊగ వాగులో ఇరుక్కుపోయిన కారును గ్రామస్థుల సహకారంతో కారును ఒడ్డుకు చేర్చారు. కంగ్టిలోని హోటల్ యజమాని పవన్ తన కారులో ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వాసర్‌కు వెళుతుండగా వంతెనపై నీరు ప్రవహిస్తున్నా అటుగా వెళ్లేందుకు యత్నించిన పవన్ కారు నీటి మద్యలో ఆగిపోవడంతో పవన్ సురక్షింగా అక్కడి నుంచి బయటడ్డాడు. వాగులు, కుంటల వద్దకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు.

## సర్వాయి పాపన్నగౌడ్ జీవితం ఆదర్శనీయం

**-సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

**సంగారెడ్డి ముంచిపట్టి ఆగస్టు 18, ప్రభాతవార్త:**

బడుగు, బలహీన వర్గాల ప్రజలను వేధించిన వారిపై పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయం అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు.సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నూతన పాపన్న విగ్రహాన్ని మంత్రి దామోదర రాజనర్సింహతో కలసి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆవిష్కరించారు సంగారెడ్డి ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు గౌడ కులస్తుల బైక్ ర్యాలిని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.గత ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధతిలను అధికారికంగా జరిపించిందని గుర్తు చేస్తారు .కలెక్టరేట్ ఎదుట ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు.జిల్లా గౌడ సంఘం భవనానికి 1ఎకరా స్థలం నిధులు మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం భవనం పూర్తి అయ్యేవరకుఓ నిధులుమంజూరుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## పెద్దచెరువును సందర్శించిన అడిషనల్ కలెక్టర్

**కొల్చారం, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

కొల్చారం మండల పరిధిలోని సంగాయపేట గ్రామ శివారులోని పెద్ద చెరువు వద్ద మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ తాసిల్దార్ శ్రీనివాస్ చారితో కలసి సదర్శించారు. కొల్చారం గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు కుంటలు జలకల సంతరించుకున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రం కొల్చారంలోని బొబ్బిలి చెరువు, కోతుల చెరువు, అలాగే వెంకటాపూర్ చెరువు, నాయిని జలాల్పూర్‌చెరువు,సంగాయిపేట చెరువు, ఎనగండ్ల మామిడి చెరువు అలుగుపారుతున్నాయి. వీటితోపాటుకుంటలు అలుగుపారుతున్నాయి. అలుగుపారుతున్న కొల్చారం బొబ్బిలిచెరువు. సంగాయపేట గ్రామ శివారులోని పెద్ద చెరువు అలుగు పాడడంతో మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్,తాసిల్దార్ శ్రీనివాస్ చారిలు గ్రామస్థులతో కలసి చెరువు వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.

## చెరువు కుంటలను పరిశీలించిన ఎంపిడివో మధులత

**నర్సాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో చెరువు కుంటలను సోమవారం ఎంపీడీవో మధులత పరిశీలించారు. నర్సాపూర్ మండల పరిధిలోని కాజీపేట, అచ్చంపేట తదితర గ్రామాల్లో ఎంపీడీవో మధులతపర్యటించి చెరువు కుంటలను పరిశీలించారు. కాజీపేటలో చెరువును పరిశీలించి చెరువు నుండి వెళుతున్న నీరు విషయాన్ని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చెరువు కట్ట తెగిపోకుండా ఇరిగేషన్ అధికారులు చెరువులోనుండి నీటినితొలగించే చర్యలుతీసుకున్నారని గ్రామస్తులు తెలిపారు. ఆనీటిని తీసేయకుంటే కట్టతెగిపోతుందన్న భయంతో నీటిని వదులుతున్నారు అని ఆమెకు వివరించారు. అదేవిధంగా అచ్చంపేటమీది చెరువు సందర్శించారు మీదిచెరువు అలుగు పారి ఊర చెరువులో వస్తుండటం వల్ల ఊరు చెరువు కూడా అలుగుపారుతుంది ఈ అలుగు, కట్ట ఏవిధంగా ఉందన్న తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని ప్రజలు అవసరంవస్తేతప్ప బయటకువెళ్ళకూడదు అన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చెరువు కుంటల వద్దకు వెళ్ళవద్దని ఆమె సూచించారు. వర్షంతో ఏమైనా అనుకోని పరిస్థితులు వస్తే సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఎంపీడీవో మధులత సూచించారు. ఈసమయంలో మంజులత వెంట ఎంపీ ఓ వైద్య శ్రీనివాస్, అచ్చంపేట గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్ రెండు గ్రామాల నాయకులు గ్రామస్తులున్నారు.

## చౌటకూరు ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

**చౌటకూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన చౌటకూరులో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించగా పలుశాఖల అధికారులు డుమ్మాకొట్టడంతో తహసీల్దార్ అనుదీప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలప్రజల నుంచి విద్యుత్ పరమైన సమస్యలు, పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, భవనాలసమస్యలు, సౌకర్యాల లోపం లాంటి అనేక అంశాలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు కార్యక్రమానికి గైర్హాజరు అవుతుండటంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వాణి కార్యమ్రానికి సంబంధితశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శంకర్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ అమృతవాణి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓపి సేవల్లో రాష్ట్రంలో మొదటిస్థానం సాధించిన దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి

**దుబ్బాక, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో ఓపి సేవల్లో దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఆసుపత్రికి వైద్యం కోసం నిత్యం అనేక మంది రోగులు వివిధ ప్రాంతాలన నుండి అధిక మొత్తంలో వస్తూ ఉంటారు. ఇది పేరుకే ప్రభుత్వ ఆసుపత్రి కాని వైద్యం కార్పోరేట్ స్థాయిలో ఉంటాయి. ఈ ఆసుపత్రిలో పని చేసే వైద్యులు, వైద్యా సిబ్బంది, ఇతర సిబ్బంది రోగుల పట్ల మర్యాధపూర్వకంగా, రోగుల పట్ల కుటుంబ సభ్యులుగా ఆత్మీయంగా మెదులుకుంటారు. ఈఆసుపత్రిలో మెరుగైనవైద్యం, మెరుగైనసేవలు అందుబాటులో ఉంటాయి. ప్రసుతి, డయాలసీస్, ఆపరేషన్లు, ఇతర వ్యదులకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ ఆసుపత్రిని తట్టుకొని ఇంత వరకు ఏ ప్రైవేట్ ఆసుపత్రి దుబ్బాకలో నిలకడలో ఉండలేక పోయాయి. రాష్ట్రంలో మొదటిస్థానం సాదించినందిందుకుగాను వైద్యాధికారి డాక్టర్ హేమరాజ్‌సింగ్ సంతోషం వ్యక్తంచేశారు. మొదటిస్థానం రావడానికి సహకరించిన వైద్యాబృంధానికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్పీ ఆఫీసులో ప్రజావాణి అర్జీల స్వీకరణ

**-ఎస్పీ శ్రీనివాసరావు**

**మెదక్ టౌన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల ఎస్ఐ, సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితి,పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ముందుకుసాగడమే లక్ష్యంగా పోలీస్‌శాఖ పనిచేస్తుందని తెలియజేశారు.

## వర్గల్ మండలంలో 3392 ఎకరాల్లో పంట నష్టం

**-మండల వ్యవసాయాధికారి శేషశయన**

**వర్గల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

వర్గల్‌మండలంలో ఆదివారంసాయంత్రం నుండి సోమవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి సుమారుగా 3392 ఎకరాలలో పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి శేషశయన తెలిపారు. సోమవారం వర్షాలకు నీట మునిగిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా నష్టంవాటిల్లిన పంటలకు నివేదిక తయారుచేసి తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

# భారీ వర్షాలకు కూలిన ఇండ్లు-కాలువకు గండ్లు

**-నీటిలో పత్తి, వరి పైరు**

**పుల్‌కల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని పలు గ్రామాల్లో ఇండ్లు కూలిపోగా రైతులు సాగు చేసుకుంటున్న పత్తి,వరిపంటలు నీటమునిగాయి. ఆయా గ్రామాల్లోని చెరువులు,వాగులు,వంకలునిండి పొర్లుతున్నాయి. ఇసోజిపేట గ్రామ శివారులోని సింగూరు ప్రాజెక్టు ఎడమ మెయిన్ బ్రాంచ కాలువకు గండి పడింది. లాల్‌సింగ్‌నాయర్ గిరిజనతండా సమీపంలోని కాలువ వరదనీటితోపొంగుతూ వరిపంటలను ముంచేసింది. పత్తి పంట కుళ్లిపోతున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చౌటకూరు, బద్రిగూడెం, సుల్తాన్‌పూర్, లక్ష్మీసాగర్, ఉమ్లానాయక్ తండా, శేరిరాంరెడ్డిగూడెం, ఉప్పరిగూడెం తదితర గ్రామాల్లో పలు ఇళ్లకూలిపోయాయి. ఉమ్లా నాయక్ తండాలోని తెజావత్ సునీత ఇల్లు ఆదివారంరాత్రి పడిపోవడంతో సునీత కుమారుడు కార్తీక్, సునీతలు గాయాలకు గురయ్యారు. సునీత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంక్షేమసంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. కూలిపోయిన ఇళ్లను ఎస్ఐ విశ్వజన్, ఎంపిడిఓ వెంకటేశ్వర్ రెడ్డిలు పరిశీలించారు. చౌటకూరు మండలంలో కూలిన ఇళ్లను తహసీల్దార్ అనుదీప్, ఎంపిడిఓ శంకర్, ఆర్ఐ ప్రమోద్‌లు పరిశీలించారు.

## తెప్పవదులుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

**నర్సాపూర్ ఆగస్టు 18, ప్రభాతవార్త:**

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నర్సాపూర్ పట్టణంలో ఇనాం ధార్ కాజీ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో నర్సాపూర్ రాయరావుచెరువు నిండుకుండలామారి అలుగు పారుతున్న నేపథ్యంలో ముస్లిం సోదరులు చెరువులో జహాజ్ (తెప్ప) వదిలే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జహాద్(తెప్ప)ను అందంగా పూలతో అలంకరించి రాయరావుచెరువువద్దకు వెళ్లి చెరువు వద్ద జహాద్ (తెప్ప)ను ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ మండల తాసిల్దార్ శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఏఈ మణిభూషణ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ రిజ్వాన్, మాజీ ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, మైనార్టీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అజ్మత్, మాజీ వార్డు సభ్యులు మహమ్మద్ రషీద్, రవి, రవి శంకర్, దిల్షాద్ ఖాన్, సాదత్ ముస్లిం మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిపార్టీ ఆధ్వర్యంలో గంగమ్మకు ప్రత్యేకపూజలు

**నర్సాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

జిల్లావ్యాప్తంగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీవర్షాలకు నర్సాపూర్ పట్టణంలోని రాయరావుచెరువు నిండుకుండలా మారడంతో సోమవారం బిజెపిపార్టీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి ప్రత్యేకపూజలు నిర్వహించి రాయరావుచెరువులో తెప్పను నీటిలోవదిలారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతసమయంలో ప్రజలనందరిని పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆగంగమ్మ తల్లిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్, రాష్ట్ర నాయకులు పెద్ద రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, రాజేందర్, జిల్లాకార్యదర్శి సత్యనారాయణగౌడ్, మాజీ కౌన్సిలర్ ఎరుకల యాదగిరి, జిల్లా ఎస్టి మోర్చా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, పట్టణ అధ్యక్షులు చంద్రయ్య , మండల అధ్యక్షులు పెద్దపులి రవి, దాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు దిగంబర్ ముదిరాజ్, చంద్రశేఖర్, స్వామి, మహిళా మోర్చా నాయకురాలు కవితా రెడ్డి, మోనిక, ఎస్సీ మోర్చా నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు కృష్ణ,బీజేవైఎం నాయకులు అర్వింద్ వాల్దాస్, నర్సాపూర్ పట్టణ బీజేవైఎం అధ్యక్షులు ప్రేమ్ కుమార్,బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు మహేందర్ గౌడ్,నర్సాపూర్ పట్టణా ఇంచార్జ్ పోతురాజు అనిల్,బీజేవైఎం నాయకులు బండి వేణు గౌడ్, పూర్ణ,శ్యామ్, శ్రీధర్ యాదవ్, బిజెపి నాయకులు గణేష్, రాంప్రసాద్, రమేష్, మనోహర్, భాను, హరీష్, కార్తీక్, రాములు, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది..

## రాబోయే ఎన్నికలలో బిఆర్‌ఎస్‌దే విజయం

**-మండలపార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి,**

**-రాష్ట్రనాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి**

**గుమ్మడిదల, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీపరిధిలోని ఇతరపార్టీలకు చెందిన కార్యకర్తలు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌పార్టీలో ఆదివారం చంద్రారెడ్డి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చేరారు. ఈసందర్భంగా యువకులుమాట్లాడుతూ, యువతకు మంచిఅవకాశాలు కల్పించేపార్టీ బిఆర్ఎస్ మాత్రమేనని అభిప్రాయపడ్డారు. పార్టీ విధివిధానాలు నచ్చి తెలంగాణలో టిఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని భావించి చేరుతున్నట్లు తెలిపారు. బి ఆర్ఎస్ పార్టీ కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఆయాం లో తెలంగాణ అభివృద్ధిని పరుగులు పెట్టించిన ఘనత కెసిఆర్ దే అని అన్నారు. ప్రతి ఒక్కరు ఇతర పార్టీల నుంచి స్వచ్ఛందంగా టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరూ కలిసికట్టుగా రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించి కెసిఆర్ కు బహుమతి అంది ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్ , శ్రీనివాస్, హనుమంత్ రెడ్డి,దేవేందర్ రెడ్డి, టీ,రాజు,సత్యనారాయణ సదానంద రెడ్డి, సంజీవరెడ్డి, గణేష్ అప్ప, రమేష్, వినోద్, చంద్రశేఖర్, మంగయ్య, యాదిరెడ్డి, గోపాల్, లక్ష్మణ్, మహేష్ యాదవ్, సాయి గౌడ్, రాజేశ్వర్, భాస్కర్ గౌడ్, శేఖర్ గౌడ్, లక్ష్మణ్, కృష్ణ, కిషన్, సత్యనారాయణ, మహేష్, అమ్మగారి ప్రేమ్ సాయిరెడ్డి, అంబరుపేట వర్షిత్ రెడ్డి, భాను యాదవ్, చిమ్ముల కౌశల్ రెడ్డి, ఆకాష్, యశ్వంత్ యాదవ్, టింకూ, సంఘం హర్ష, బంటి, పలువురు యువకులు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవనాలకు స్థలాన్ని కేటాయించాలి

**గుమ్మడిదల, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

అంగన్వాడిభవనాలకు కావలసినస్థలాన్ని కేటాయించాలనీ గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన అంగన్వాడి టీచర్లు మండల తహసిల్దార్ పరమేశంకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారి వినతిపత్రాన్ని స్వీకరించిన తహసిల్దార్ పరమేశం మాట్లాడుతూ నివేదికను పైఅధికారులకు పంపించి అంగన్వాడి భవనాల సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు అర్చన, లావణ్య, మంగ, గుమ్మడిదల మాజీ సర్పంచ్ తులసీదాస్, రాహుల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నిండుకుండలా గుమ్మడిదల చెరువులు

**-ప్రత్యేక పూజలు చేసిన రైతులు**

**గుమ్మడిదల, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు నిండుకుండలా మారాయి. గుమ్మడిదల మండలం ప్రాంతం పూర్తిగా ప్రజలు భూమిపై ఆధారపడి భూమిని నమ్ముకుని జీవించే రైతులు దీంతో సంతోషం వ్యక్తం చేశారు. రైతులు చెరువులకు ప్రత్యేక గంగమ్మ పూజలు నిర్వహించి సారే సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానంద రెడ్డి, గ్రామ తాజా మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, మద్దుల బాల్ రెడ్డి,తులసీదాస్, చిమ్ముల దేవేందర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆకుల ఆంజనేయులు, కవ్వం రవీందర్ రెడ్డి, చంద్రారెడ్డి, బాల్ రెడ్డి, రాజిరెడ్డి,గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నాయిని మల్లమ్మకు నివాళులర్పించిన మైనంపల్లి

**గజ్వేల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

గజ్వేల్ పట్టణానికి చెందిన నాయిని మల్లమ్మ దశదినకర్మ కార్యక్రమాన్ని పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించగా ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ బట్టి జగపతి, సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి పాల్గొని మల్లమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారితోపాటు సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, బిజెపి నాయకులు వెంకటరమణారెడ్డి, అరవింద్, సందీప్, మాజీకౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలేష్, కిషన్‌రెడ్డి, మల్లేశం, ఆర్‌కె.శ్రీను, మాజీ డైరెక్టర్ నిమ్మ రమేష్ పాల్గొన్నారు.

## పార్టీప్రతిష్ఠను దెబ్బతీస్తున్న విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయండి

**-పిసిసి చీఫ్‌కు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నేతలు**

**గజ్వేల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

భూకబ్జాలు, అక్రమాలు, అవినీతి, కులంపేరుతో బెదిరింపులకు పాల్పడుతూ కాంగ్రెస్‌పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న విజయ్‌కుమార్ అలియాస్ కొమ్ము యాదగిరిని పార్టీసభ్యత్వం నుండి తొలగించాలని కోరుతూ సోమవారం గజ్వేల్ కాంగ్రెస్ నేతలు పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఆధారాలతోకూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్, ఎంపి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం చేసినట్లు స్పష్టంచేశారు. అయితే తనఎస్సీ సెల్ అధ్యక్షపదవిని అడ్డుపెట్టుకొని గ్రామాల్లో భయభ్రాంతులకు గురిచేస్తూ సెటిల్మెంట్లకు పాల్పడుతున్నట్లు పిసిసిచీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ దృష్టికి తెచ్చారు. డిసిసిబి ఎన్నికల్లో సైతం పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి ఇద్దరు అభ్యర్థులను విత్‌డ్రా చేయించినట్లు గుర్తుచేశారు. ముఖ్యంగా కొండపాక శివారులోని భూమిని ఓమహిళను బెదిరించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోగా, జప్తినాచారం శివారులో ప్రభుత్వ భూమికబ్జాచేసి అనుచరులచే నిర్మాణాలు చేపట్టడం, తిమ్మారెడ్డిపల్లిలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నంచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, మాజీ కార్పోరేషన్ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన



మల్లికార్జునస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన చేస్తున్న భక్తులు

**సదాశివపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

హిందువులకు అత్యంత పవిత్రమైన శ్రావణమాసంలో ప్రజలు దేవతా మూర్తులను భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. సదాశివపేటలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసంలో చివరి సోమవారం అవటంతో భక్తులు లక్ష బిల్వార్చన కార్యక్రమం చేపట్టారు. మొదట శంకర్‌గౌడ్, మురళిగౌడ్, రాజుగౌడ్ దంపతులు మల్లికార్జునస్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. తర్వాత 1983–84 పదవ తరగతి పూర్వ విద్యార్థుల మిత్రబృందం పర్యవేక్షణలో గంట శివయ్య, శంకర్, సంగమేశ్వర్, రజనీకాంత్, శంకరప్ప, మురళిగౌడ్, రాజుగౌడ్, రమేష్ దంపతులతోపాటు తుమ్మలపల్లి అనురాధశ్రీనివాస్‌రెడ్డిలు మల్లికార్జునస్వామికి బసవరాజుస్వామి అష్టోత్తర శతనామావళి పటిస్తుండగా లక్ష బిల్వార్చన పూజాకార్యక్రమం చేశారు. అనంతరం ఆస్వామివారికి మంగళహారతులు నైవేద్యం సమర్పించారు.

## రెవెన్యూ డివిజన్ అయ్యేంతవరకు పోరాటం ఆగదు

**-జెఏసి చైర్మన్ వకుళాభరణం నర్సయ్య పంతులు**



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న జెఏసి, అఖిలపక్షాల నేతలు

**చేర్యాల, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

చేర్యాల రెవెన్యూ డివిజన్ చేసేంతవరకు పోరాటాలు చేస్తూనే ఉంటామని జెఏసి చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు అన్నారు. సోమవారం జెఏసి, అఖిలపక్షాల ఆధ్వర్యంలో మండలంలోని వేచరేణి, తాడూరు, చిట్యాల, దానంపల్లి, కమలాయపల్లి, అర్జునపట్ల, దొమ్మాట, గుర్జకుంట, ఆకునూరు, రాంపూర్‌తో పాటు చేర్యాల పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి తహసీల్దారు దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం జెఏసి, అఖిలపక్షాల నేతలు మాట్లాడుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని సుమారు 8సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఎంపి ఎన్నికల్లో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డివిజన్ చేస్తాననిచెప్పి మరిచాడన్నారు. ఇప్పటికెనా డివిజన్‌చేసి కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాటను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జెఏసి చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు, ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఆముదాల మల్లారెడ్డి, బూరుగు సురేష్‌గౌడ్, వడ్లకొండ సంజీవులు, పూర్మ నారాయణరెడ్డి, భూమిగారి రాజేందర్, ముస్త్యాల నాగేశ్వర్, వెంకట్‌మావో, తిరుపతిరెడ్డి, చింతల పర్శరాములు, పాండు, మానస, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక అభిషేకాలు, ప్రత్యేకపూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**సదాశివపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

శ్రావణ చివరి సోమారాన్ని పురస్కరించుకొని సదాశివపేట పట్టణ,మండల గ్రామాలలోని శివాలయాలలో అభిషేకాలు, బిల్వార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని సంగమేశ్వరమందిరం, అంకెనేపల్లి చౌరస్తాలోని పార్వతి ఇంద్రేశ్వర అభిషేకం, బిల్వార్చన, ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిఎన్ మోహన్‌రావు, నారాయణరావు, నారాయణరావు, బసవరాజు, తదితరులతో పాటుగా మున్సిపల్ మేనేజర్ ఉపేందర్ సింగ్, మున్సిపల్ సిబ్బంది, సంగమేశ్వర మందిరం శివస్వాములు, భక్త బృందం పాల్గొన్నారు.

## మందకృష్ణ సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**వట్‌పల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

ఈనెల 24న జోగిపేటలక్ష్మీనరసింహగార్డెన్‌లో నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ అభినందనసభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఆయనకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా సన్మానసభకు సంబంధించిన సన్నాహకసభ వట్టిపల్లి మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ సంజీవయ్య, మాజీ జడ్పిటిసి అర్జునయ్య ఎంఆర్పిఎస్ నాయకులు క్రిష్ణ, సంతోష్, రాములు, లింగయ్య, శివయ్య, సాయిలు, బుర్రగళ్ళ ప్రభాకర్, కాంగ్రెస్‌నాయకులు, రవీందర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ వట్టిపల్లి అధ్యక్షులు, నరసింహులు శ్రీను,నాగేష్,అనిల్,భూమయ్య,నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మకు ప్రత్యేకపూజలు చేసిన ఎమ్మెల్యే



ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

నర్సాపూర్, మున్సిఫల్ పరిధిలోని రాయారావు చెరువుకట్టపైనున్న కట్టమైసమ్మ,రేణుకాఎల్లమ్మతల్లిదేవతలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. గతవారంరోజులుగా ఎడతెరిపిలేకుండా నిర్విరామంగా కురుస్తున్న వర్షాలకు రాయరావు నిండుకుండలామారి అలుగు పారుతున్న సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి రాయరావు చెరువుకట్టమీద నెలకొన్న మైసమ్మ తల్లి,రేణుక ఎల్లమ్మ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు, అనంతరం గంగమ్మతల్లికి పూర్ణకుంభహారతి ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు, మండలపార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ గొప్ప పోరాటయోధుడు

**-జిల్లా కలెక్టర్ కె.హైమావతి**



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ఆగస్టు 18, ప్రభాతవార్తప్రతినిధి:**

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ గొప్ప పోరాటయోధుడని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా బిసిసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎన్సాన్‌పల్లి రోడ్డు చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ సబ్బండవర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం ఆయనచేసినకృషి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ అధికారులు, గౌడసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్: మున్సిపల్ చైర్మన్ మంజుల**

బహుజన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజుల అన్నారు. జిల్లా కేంద్రంలో సర్వార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనగోని వినోద్‌గౌడ్, సాయిగౌడ్, పాపన్న సంఘం అధ్యక్షులు పల్లె బాలకిషన్‌గౌడ్, వివిధ సంఘాల అధ్యక్షులు పల్లె లాల్‌బహుదూర్‌గౌడ్, అంబటి భాస్కర్‌గౌడ్, ఐలయ్యయాదవ్, ప్రభాకర్‌వర్మ, గున్నాల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సునీల్‌గౌడ్, వడ్లకొండ శ్రీనివాస్‌గౌడ్, బిసి వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో...**

హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను బిజెపి పట్టణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోడిగే వెంకటేష్, వేల్పుల నాగార్జున్, కాదాసు దీపికా, రాంప్రసాద్, రాజేందర్‌చారీ, సాయిరామ్, బుర్ర రాజు, సంతోష్, శ్రీనివాస్, లకవత్ శారద, తిరుపతి, రాజేష్, నాగరాజు, శ్రీనివాస్, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో...**

మండలపరిధిలోని ఆయా గ్రామాలలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని మోకుదెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు ఐనాపూర్, రసులాబాద్, గౌరాయిపల్లి, పోసాన్‌పల్లి, గురువన్నపేట, మర్రిముత్యాల, కిష్టంపేట, రాంసాగర్ తదితర గ్రామాల్లో పాసన్నగౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడజన హక్కుల పోరాటసమితి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు పచ్చిమట్ల స్వామిగౌడ్, పిఎసిఎస్ చైర్మన్ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షులు ముత్యం నర్సింలుగౌడ్, మండల అధ్యక్షులు కృష్ణగౌడ్, బత్తి నర్సింలుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ముత్యం విజయ్‌కుమార్‌గౌడ్, వెంకటేశంగౌడ్, రమేష్‌గౌడ్,నరేష్‌గౌడ్, కనకరాజు, రాములుచారి, రమేష్, ఎల్లయ్య, అశోక్, కనకయ్య, నారాయణ, మహేష్, కిష్టయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అలాగే మండల కల్లుగీత కార్మిక సంఘం కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గీస బిక్షపతి, సిలివేరి సిద్దప్ప, గొల్లపల్లి భాగ్యలక్ష్మీ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## 32లక్షలతో చైన్‌లింక్ మెష్‌కు శంకుస్థాపన

**-కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి**



చైన్‌లింక్ మెష్‌కు శంకుస్థాపనచేస్తున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

భారతీనగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ అంబేద్కర్ విగ్రహం (ఇఎస్ఐ రోడ్డు) వద్ద ఎంఎంటిఎస్ రోడ్డులో 32 లక్షల రూపాయల అంచనా వ్యాయంతో నిర్మించే చైన్ లింక్ మెష్ పనులకు కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం చెత్తతో నిండుఎపోవడంతో అనేక మార్లు శుభ్రం పరిచినప్పటికి శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయించి చైన్ లింక్ మెష్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రణాళిక బద్దంగా డివిజన్ అభివృద్ధికి తన వంతు సహకారం చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఇంజనీరిర్ ఏఈ ఫైజెన, ఎల్ఐజి కాలనీ అధ్యక్షులు యాదగిరిరెడ్డి, మ్యాక్ సొసైటీ సలీం, సెక్రటరీ నందగోపాల్, డైరెక్టర్లు పాపయ్య, రామారావు, సర్కిల్ బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు నరసింహ, మైనార్టీ కార్యదర్శి గౌస్, నాయకులు కుతుబుద్దీన్, జాకీర్, పాటి సత్యనారాయణ, దేవేంద్ర చారి, వెంకట్‌రెడ్డి,నరేష్, విజయ్, రాజు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## బొక్కస్‌గాంలో కూలిన ఇల్లు



బొక్కస్‌గాంలో కూలిపోయిన ఇంటి దృశ్యం

**సిర్గాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని బొక్కస్‌గాంవ్‌లో సోమవారం ఓ ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన కమ్మరి గంగాధర్ నివసిస్తున్న ఇంటి వెనుక భాగం వర్షానికి తిడిసి కూలిపోయిందని బాధితుడు కన్నీరు కార్చారు. ఆదివారం రాత్రికి కుటుంబ సభ్యులందరం ఇంట్లోనే నిద్రకు ఉపక్రమించామని, సోమవారం తెల్లవారు జామున కూలిన శబ్దం రావడంతో అటుగా వెళ్లి చూడగా త ఇంటి గోడనే కూలినట్లు గుర్తించామని వాపోయారు.

## సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

**-అదనపు కలెక్టర్ మాధురి**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 18, ప్రభాతవార్త:**



నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్‌ఓ పద్మజారాణి

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసినజయంతి ఉత్సవ కార్యక్రమంలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి అదనపు కలెక్టర్(రెవెన్యూ) మాధురి, డిఆర్ఓ పద్మజారాణి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో బిసిసంక్షేమశాఖ అధికారి జగదీష్, గౌడసంఘసభ్యులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ తెల్ల రేషన్‌కార్డులు

**-మండలకాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహారెడ్డి**



రేషన్‌కార్డులను అందచేస్తున్న మండలకాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహారెడ్డి

**జహీరాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డును అందచేస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని షేఖాపూర్‌లో నిర్వహించిన గ్రామ సభలో కొత్తగా మంజూరైన తెల్ల రేషన్‌కార్డులను లబ్దిదారులకు పంపిణి చేశారు. ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి హామిని ప్రభుత్వం అమలు చేస్తూ వస్తోందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తన 10 సంవత్సరాల పాలనలో ఒక్క రేషన్‌కార్డు ఇచ్చిన సంఘటన లేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన చేస్తోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు మద్దతు పలకాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మజీ ఎఎంసి వైస్ చైర్మన్ అక్బర్ హుస్సేన్, సిడిసి డైరెక్టర్ జి మల్లారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ఇమాం పటేల్, మాజీ ఎంపిటిసి సభ్యులు ఎస్ నరసింహులు, మాజీ సర్పంచ్ చెన్నారెడ్డి, పంచాయితీ కార్యదర్శి,నాయకులు చేస్మోద్దిన్, ఆరిఫుద్దీన్, షేక్ అలీ, కుర్షిద్, నారాయణగౌడ్, సైఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నీటమునిగిన పంటలను పరిశీలించిన అధికారులు



నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ

**న్యాల్‌కల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నీటి పాలైన రైతులు సాగు చేసుకుంటున్న పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. మండల పరిధిలోని రేజింతల్, మామిడ్గి, ముంగి, హద్నూర్, హుమ్నాపూర్, మరియంపూర్, బసంత్‌పూర్ తదితర గ్రామాల్లోని పంటలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అభినాష్ వర్మ మాట్లాడుతూ వ్యవసాయ భూమిలో ఆగి ఉన్న నీటిని కాలువల ద్వార బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. మండలంలోని బసంత్‌పూర్ గ్రామంలో రైతులు సాగు చేసుకుంటున్న సోయ, మినుము, పెసర పంటలు కొంత మేరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుడిని పంపాలని విద్యార్థుల నిరసన

**మనూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని దవ్వూర్ గ్రామంలోని పాఠశాల నుంచి ఉపాధ్యాయుడు విఠల్‌రెడ్డిని పాఠశాలనుంచి విద్యాశాఖ అధికారులు బదిలీచేయడంతో పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులు, పోషకులు సోమవారం పాఠశాల ముందు నిరసన వ్యక్తంచేశారు. పాఠశాలలో విద్యార్థులసంఖ్య తక్కువగా ఉందంటూ ఉపాధ్యాయులు విఠల్‌రెడ్డిని ఇతరపాఠశాలకు బదిలీచేశారు. పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని బదిలీచేస్తే తమవిద్యాభ్యాసం సాగేదెలా అని, పాఠశాలలో విద్యాప్రమానాలు దిగజారవా అంటూ పోషకులతోపాటు విద్యార్థులు నిరసన వ్యక్తంచేసి, డిఈఓ, ఎంఈఓలకువ్యతిరేకంగా డౌన్‌డౌన్ అంటూ నినాదాలుచేస్తూ తమనిరసనను వ్యక్తంచేశారు.

# పరిహారమైనా ఇప్పించండి-నీమ్జ్ నుంచైనా తొలగించండి

**-జిల్లా కలెక్టర్‌తో హద్నూర్ నీమ్జ్ భూ బాధితులు**



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న హద్నూర్ నీమ్జ్ భూబాధితులు

**న్యాల్‌కల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

అడకత్తెరలో పోకచెక్కలా తమపరిస్థితి దయనీయంగా మారిందని మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన నీమ్జ్ భూబాధితులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా రైతులు షబ్బీర్‌ఖాన్, శంభునోళ్ల నర్సారెడ్డి, బోరంచ సంగారెడ్డి, మున్నూర్ రాజు, ఎస్ అంజిరెడ్డి, అశోక్, రాచన్న, కిష్టన్న, శివరాజ్, సంజయ్, ఖాజాలు మాట్లాడుతూ తమ అత్యవసరాలకై తమపట్టాభూములపై బ్యాంక్‌లో రుణాలను అందుకోలేకపోతున్నామని, అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్‌లు కావడంలేదని, తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమభూములకు డబ్బులు ఇప్పించి తమ ఫైల్‌లను అథారిటీకి పంపాలని, లేదా తమ భూములను నీమ్జ్ ప్రాజెక్టు నుంచి తొలగించాలని వారు కోరారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పందించి తమసమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

## లెఫ్ట్ కెనాల్ జామ్-వరి పొలాల్లోకి వరద నీరు



నిండు కుండలా మారిన నల్లవాగు ప్రాజెకు దృశ్యం

**సిర్గాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని అంతర్గాం గ్రామ శివారులోని నల్లవాగు ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ జామ్ అయింది. కాలువలో చెత్తా చెదారం పేరుకుపోవడం, మొలసిన పిచ్చి మొక్కలను తొలగించకపోవడంతో కాలువల గుండా నీరు పారే అవకాశం లేక కాలువపై నుంచి నీరు ప్రవహిస్తూ రైతులు సాగు చేసుకుంటున్న పంటల్లోకి చేరుకుని పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటల్లోకి వరద నీరు చేరుకోవడంతో ఇసుక మేట వేస్తోందని రైతు నాగనాథ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల వద్ద కల్వర్టు ఎత్తు తక్కువగా ఉండటంతో వరద ఉధృతి ఎక్కువై వరద నీరు పంట పొలాల్లోకి చేరుకుంటున్నాయని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

## నల్లవాగు నుంచి నీటిని వదలిన అధికారులు



నల్లవాగు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న అధికారులు

**సిర్గాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువల ద్వార నీటి పారుదల శాఖ ఈఈ సురేందర్ నీటిని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండిందని, సోమవారం ఒక ఫీట్ ఎత్తులో దిగువకు నీటి వదిలినట్లు డీఈఈ పవన్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 149ఫీట్లకు గాను 1494.5 ఫీట్లకు నీరు చేరుకున్నాయన్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 8571 క్యూసెక్కులు కాగా 5953 క్యూసెక్కుల అలుగు ద్వార ఔట్ ఫ్లోగా ఉందని అధికారి వివరించారు. నల్లవాగు ప్రాజెక్టు నిండు కుండలా మారడంతో సిర్గాపూర్, కల్హేర్, పిట్లం మండలాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## బహుజనుల ధీరుడు సర్వాయి పాపన్నగౌడ్

**-కలెక్టర్ రాహుల్‌రాజ్**





నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**మెదక్ టౌన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు కలెక్టర్ రాహుల్‌రాజ్. మెదక్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ టెంపుల్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి అదనపు కలెక్టర్ నగేష్, గౌడ సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గంగాకృష్ణ, గౌడసంఘం జిల్లా అధ్యక్షులు రమేష్‌గౌడ్, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు మెట్టు గంగారం, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ శ్రీనివాస్, ప్రణయ్, మహేందర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెగిన బట్టికుంట చెరువు కట్ట



బట్టికుంట చెరువుకట్ట తెగిపోయి వృథాగా ప్రవహిస్తున్న నీరు

**అల్లాదుర్గం, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని బట్టికుంట చెరువు కట్ట కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం రాత్రి తెగిపోయింది. ఆయా ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో బట్టికుంట చెరువు నిండు కుండలా మారిపోయి చెరువు కట్ట తెగిపోయింది. చెరువు కట్ట తెగిపోవడంతో రైతులు పండిస్తున్న పంటల్లోకి, గ్రామంలోని బిటి రోడ్లు గుండా నీరు ప్రవహిస్తుండటంతో అటురైతులు, ఇటుప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు. ఉదయం 7గంటలవరకు మండల కేంద్రానికి రాకపోకలు ఆగిపోయాయి. ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే చెరువుకట్టకు గండిపడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పటేల్‌చెరువులోకి వెళ్లే కాలువ పూడికతో పేరుకుపోవడంతో వరదనీరు కాలువల నుంచి కాకుండా పంటపొలాల్లోకి చేరుకుని పంటలకు నష్టంవాటిల్లేలా చేశాయని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అల్లాదుర్గంలోని పలు ఇళ్లు పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా కూలిపోయినట్లు ప్రజలు వాపోయారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

**-పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి**



సర్వాయిపాపన్నవిగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని సోమవారం నర్సాపూర్ పట్టణంలోని నర్సాపూర్ సంగారెడ్డి ప్రధాన రోడ్డు మార్గంలో గల సర్వాయిపాపన్నవిగ్రహానికి పార్టీలకతీతంగా ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ మున్సిపల్ మాజీ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ బిజెపిపార్టీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్ మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్ లలిత నర్సింగ్ నాయక్ బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు పెద్ద రమేష్ గౌడ్ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్ నాయకులు నవీన్ గుప్తా వెంకట్రామరెడ్డి శ్రీనివాస్ గుప్తా సత్యం గౌడ్ అశోక్ గౌడ్ బిక్షపతి గౌడ్ కృపాచారి ఎద్దు మల్లేష్‌యాదవ్ కుమ్మరి సురేష్ కుమ్మరి నాగేష్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.